ప్రజాశక్తి
ఆదివారం 21 జులై 2024 | 5 | అనంతపురం



నివురుగప్పిన నిప్పులా తాడిపత్రి

◆ నేతల నోట ఫ్యాక్షన్ మాటలు ◆ మొన్న జెసిపిఆర్..నిన్న కేతిరెడ్డి సవాళ్లు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తాడిపత్రి నియోజకవర్గం నివురుగప్పిన నిప్పులాగానే ఉందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2019 నుంచి ఇక్కడ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతూనే వస్తున్నాయి. ఇప్పటికీ అవి చల్లారినట్టు అనిపంచడం లేదు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మొన్న కౌన్సిల్ సమావేశం అనంతరం పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తానంటున్నాడు... ఆయన్ను జిల్లా నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన తాడిపత్రి పట్టణంలోకి వస్తే పంచె విప్పి కొడతామని హెచ్చరికలు చేశారు. అది జరిగిన మరుసటి రోజే శనివారం నాడు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లడం చర్చనీయాంశమైంది. ఎన్నికల సమయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి నమోదయిన కేసులో పెద్దారెడ్డి హైకోర్టులో బెయిల్ పొందారు. దీనికి సంబంధించి ష్యూరిటీలు సమర్పించేందుకు ఆయన పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఏదైనా జరుగుతుందేమోనన్న ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అయితే ఎన్నికల సమయంలో జరిగిన ఘర్షణ అనంతరం అధికారులపై చర్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు జాగ్రత్తలను పోలీసులు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి పరస్పర కవ్వింపు చర్యలు పాల్పడకుండా వెంటనే పెద్దారెడ్డిని అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతపురం నగరానికి వచ్చాక ఆయన జెసి.ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తాడిపత్రి ఆయన జాగీరు కాదని అంటూనే తనను అంతమెదిస్తానని ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నాడని ఆరోపించారు. ఆరోపించడమే కాకుండా తనకు లాగానే ఆయనకు కుటుంబముందని నేరుగా ప్రకటనలు చేయడం రాజకీయంగా చర్చనీయాంశం అమవుతోంది. ఇద్దరి నేతల నుంచి ఇటువంటి ప్రకటనలు రావడంతో ఆ ప్రాంతంలోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే తాడిపత్రి అంటూనే ఫ్యాక్షన్‌కు పెట్టింది పేరుగా ఉంది. అయితే గడిచిన దశాబ్దకాలంగా అటువంటి ఘటనలేవి చోటు చేసుకోలేదు. 2014లో పెద్దవడుగూరులో సింగిల్ విండో ప్రెసిడెంట్ హత్య అనంతరం రాజకీయపరమైన హత్యలు జరిగిన ఘటనలేవి చోటు చేసుకోలేదు. అయితే ఇప్పుడు ఇద్దరు నేతల నుంచి ఫ్యాక్షన్ అన్న పదాలు బయటకు వస్తుండటంతో తిరిగి ఈప్రాంతంలో అవాంఛనీయ ఘటనలకు ఎక్కడ దారితీస్తాయోనన్న గుబులు నియోజకవర్గ ప్రజల్లో నెలకొంటోంది. అయితే పోలీసు అధికారులు దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. కొత్తగా జిల్లా ఎస్పీ మురళీకృష్ణ బాధ్యతలను తీసుకున్నారు. ఆయన ఈ ప్రాంత సమస్యలను ఇంకా పరిశీలించాల్సి ఉంటుంది. అంతకు మునుపు ఎన్నికల సమయం నుంచి వరుసగా ఎస్పీలతోపాటు డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఎన్నికల రోజు జరిగిన ఘర్షణను నివారించలేకపోయారని అప్పటి ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సిఐ మురళీకృష్ణలు సెస్పెన్షన్‌కు గురాయ్యరు. ఇంకా నిఘా విభగాపు అధికారి బదిలీ అయ్యారు. ఇలా ఇంత మంది ఇక్కడి ఘటనలపైనే ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కొత్త అధికారులు ఇక్కడి పరిస్థితులను ఏ రకంగా నియంత్రణలోకి తీసుకొస్తారన్నది చూడాల్సి ఉంది.

తాడిపత్రిలో అలజడికి జెసి యత్నం

నన్ను అంతం చేస్తానంటూ బెదిరింపులు - తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిలో అలజడి సృష్టించేలా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. తనను చంపుతానని కూడా ప్రభాకర్‌రెడ్డి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. పెద్దారెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించాలని జెసి.ప్రభాకర్‌రెడ్డి కోరిన మరుసటి రోజే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం నాడు తాడిపత్రికి వెళ్లడం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లకు సంబంధించి కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో పెద్దారెడ్డి బెయిల్ పొందారు. దీనికి సంబంధించి ష్యూరిటీ ఇచ్చేందుకు ఆయన తాడిపత్రికి వెళ్లారు. ఆయన వెళ్తుండటంతో పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. ఆయన తిరిగి వచ్చాక అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తనను జిల్లా నుంచి బహిష్కరించాలని ప్రభాకర్‌రెడ్డి కోరుతున్నారని... ఈ ప్రాంతం ఆయన జాగీరు కాదని యెద్దేవ చేశారు. తనను అంతం చేస్తానని జెసి.ప్రభాకర్‌రెడ్డి అంటున్నారని... కుటంబం తనకే కాదని ఆయనకు ఉందని పేర్కొన్నారు. వాహనాల కేసులు తాను పెట్టింది కాదని... అధికారులు పెట్టిందన్నారు. అందులో ఎన్‌ఫోర్సుమెంట్ కూడా ఉందన్నారు. తప్పు చేశాడో లేదా అన్నది ఆయన నిరూపించుకోవాల్సి ఉందన్నారు. జెసి తాడిపత్రిలో అలజడలు సృష్టించేందుకే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. తన అనుయాయులను భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి భయపడేది లేదని తెలిపారు.

ఆరిన ఇంటిదీపాలు

◆ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతి
◆ మృతులిద్దరూ వరుసకు అక్కాతమ్ముడు

ముద్దులొలికే ఇద్దరు చిన్నారులు ఎంతో సంతోషంగా ఉదయాన్నే పాఠశాలకు బయల్దేరారు. అమ్మనాన్నలలకు టాటా చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చారు. చెప్పమీద ముద్దుపెట్టి తమ పిల్లలను తల్లిదండ్రులు సాగనంపారు. మామయ్య పాఠశాలలో దింపుతానంటే ఆయన మోటార్‌బైక్‌లో ఎక్కారు. వచ్చిరాని మాటలతో మామయ్యతో మాట్లాడుతూ బడివైపు బయల్దేరారు. మరికాసేపట్లో పాఠశాల దగ్గరకు చేరేలోపు అనుకోని ఘటన ఆ పసి హృదయాలను ఛిద్రం చేసింది. కనుమూసి తెరిచేలోపు రక్తపు మడుగులో ఇద్దరూ పడిపోయారు. స్థానికులు గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృత్యుఒడికి చేరారు. మృతి చెందిన ఇద్దరూ వరుసకు అక్కాతమ్ముడు అవుతారు. ఇంటి దీపాలు ఆరిపోవడంతో ఆ కుటుంబాల్లో చీకట్లు అలముకున్నాయి. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం ఎస్.హొసహళ్లి వద్ద శనివారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.



మృతి చెందిన ఇద్దరు చిన్నారులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-గుమ్మగట్ట, రాయదుర్గం

గుమ్మఘట్ట మండలం ఎస్.హొసనహల్లికి చెందిన మల్లికార్జున, మల్లేష్‌కుమార్‌లు అన్నాదమ్ములు. వీరిలో మల్లికార్జున, గోవిందమ్మల కుమారుడు అరుణతేజ(8), మల్లేష్ కుమార్ లేపాక్షి దంపతుల కుమార్తె స్పందన (11) ఉన్నారు. ఈ చిన్నారులు అరుణతేజ 3వ తరగతి, స్పందన 5వ తరగతి రాయదుర్గం నారాయణ ప్రయివేటు పాఠశాలలో చదువుతున్నారు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు ఇద్దరూ బయల్దేరారు. వీరిని పాఠశాలలో దింపేందుకు వారి మేనమామ సురేష్‌కుమార్ ఇద్దరినీ ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని బయల్దేరాడు. ద్విచక్రవాహనం పాఠశాల వైపు వెళ్తుండగా భూపసముద్రం వేదవతి హగరి వద్ద నుంచి ఇసుకలోడుతో అధిక స్పీడుతో వస్తున్న ట్రాక్టర్ ఓవర్‌టేక్ చేయబోయి ద్విచక్రవాహాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలో ఉన్న ముగ్గురూ కిందపడ్డారు. బాలుడు అరుణతేజకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన మరో చిన్నారి స్పందనను చికిత్స నిమిత్తం బళ్లారికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ద్విచక్రవాహనం తోలుపుతున్న సురేష్ గాయాలతో ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డాడు. ఒకే కుటుంబంలో ఇద్దరు చిన్నారులు మరణించడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విఘతజీవులుగా పడి ఉన్న పిల్లల్ని చూసి తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణం అయిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

వేతనం కోసం చేతులుకట్టుకుని వేడుకోలు..!

తహశీల్దార్ కార్యాలయం వద్ద మున్సిపల్ సిబ్బంది నిరీక్షణ

ప్రజాశక్తి-తాడిపత్రి



తహశీల్దార్ కార్యాలయంలో చేతులు కట్టుకుని అధికారుల వద్ద నిల్చున్న మున్సిపల్ సిబ్బంది

సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేసేందుకు వారు శక్తివంచన లేకుండా కృషి చేశారు. అధికారులు అప్పజెప్పిన అన్ని బాధ్యతలనూ సక్రమంగా పూర్తి చేశారు. ఇంత కష్టపడి పని చేసిన వారికి ఎన్నికల విధుల వేతనం మంజూరు చేయడానికి అధికారులకు చేతులు రావడం లేదు. పనిచేసి కాలానికి సంబంధించి డబ్బుల కోసం ఏకంగా చేతులు కట్టుకుని అధికారుల వద్ద నిలబడినా వారిని పట్టించుకోలేదు. శనివారం ఉదయం తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... ఇటీవల సార్వత్రిక ఎన్నికలు తాడిపత్రి నియోజకవర్గంలో సజావుగా నిర్వహించడంలో మున్సిపల్ ఉద్యోగుల పాత్ర వెలకట్టలేనిది. ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటి నుంచి 75 రోజుల పాటు కమాండ్ కంట్రోల్ కింద షిఫ్టల ప్రకారం నిర్విరామంగా కషి చేశారు. వీరి స్థాయిని బట్టి ఒక్కొక్కరికి రూ.22 వేల నుంచి రూ.33 వేల వరకు డబ్బులు వేతనం కింద రావాల్సి ఉంది. వీరికి సంబంధించిన వేతనాలను కేంద్ర ఎన్నికల సంఘం నిధులు విడుదల చేసినా స్థానిక ఎన్నికల అధికారి డబ్బులు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి 50 రోజులు కావొస్తున్న వీరికి రావాల్సిన డబ్బులు చేతికందలేదు. నిత్యం వీరంతా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. శనివారం నాడు తహశీల్దార్ కార్యాలయంకు వచ్చిన సిబ్బంది అధికారుల ఎదుట చేతులు కట్టుకుని వారికి రావాల్సిన డబ్బులు ఇప్పించాలని వేడుకున్నారు. అయినా వారి సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. పైగా ఇందులో మరో విశేషం ఏమిటంటే సంబంధిత ఉద్యోగులకు డబ్బులు చెల్లించినట్లు ఇప్పిటికే వారితో అధికారులు సంతకాలు తీసుకున్నారు. డబ్బులు ఇచ్చినట్లు సంతకాలు తీసుకున్న తర్వాత ఇలా ఇవ్వకుండా కాలయపాన చేస్తుండడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన వేతనా బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులు కోరుతున్నారు.



నియమక పత్రం అందిస్తున్న ఇన్‌ఛార్జి విసి

జెఎన్‌టియు రిజిస్ట్రార్‌గా ఎస్.క్రిష్ణయ్య

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు రిజిస్ట్రార్‌గా అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ సీనియర్ ఆచార్యులు సంక్రాంతి క్రిష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి సుదర్శనరావు శనివారం ఉత్తర్వులు వెలువరించారు. నూతన రిజిస్ట్రార్‌కు ఉపకులపతి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సివిల్ ఇంజినీరింగ్ విభాగం వైశాలి, అరుణక్రాంతి, అజిత, శశిధర్, సీనియర్ భానుమూర్తి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గురు అధికారులు బదిలీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా పరిధిలో ఒకేసారి ముగ్గురు ఐఎఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో అనంతపురం జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఉన్నారు. ఆయన వైసిపి ప్రభుత్వ హయాంలోనే ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన్ను రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఎన్నికల సమయంలో నియమితులైన వై.మేఘ స్వరూప్‌ను మదనపల్లి సబ్‌కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన సతీమణి జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్ నదీయా దేవిని రాజంపేట సబ్‌కలెక్టరుగా బదిలీ చేశారు. వీరి స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ కొత్తవారిని నియమించలేదు.

తెలంగాణ సీఎంను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ కన్వెన్షన్‌లో నిర్వహించిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సమ్మిట్ (కెజిఎఫ్)లో ఎమ్మెల్యే దగ్గుపాటి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరు కావడంతో దగ్గుపాటి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్, తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరావుని కూడా కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కమ్మవారు ఏరంగంలో ఉన్నా అక్కడ ఉన్నత శిఖరాలకు వెళ్లడంతోపాటు సేవా భావాన్ని మరువరన్నారు. పదిమందికి సాయం చేయడం, ఉపాధి కల్పించడం వంటివి కమ్మ సామాజిక వర్గంలో ఎక్కువగా ఉంటాయన్నారు.



తెలంగాణ సిఎం రేవంత్‌తో ఎమ్మెల్యే దగ్గుపాటి కరచాలనం

తుంగభద్ర జలాశయానికి వరద

ప్రజాశక్తి-బొమ్మనహాళ్



తుంగభద్రకు చేరిన నీరు

కర్నాటక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు 70 టిఎంసిల నీరు జలశయంలో నిలువున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయంలోకి వరద నీరు భారీగా చేరడంపై బొమ్మనహల్, కణేకల్ మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జలాశయంలో నీటిమట్టం ఆశాజనకంగా ఉంది. స్టోరేజ్, నీటి సాంద్రత భారీగా పెరిగింది. నీటి నిల్వ పెరగడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులుండవని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. గత సంవత్సరం జలాశయంలో 12 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఇప్పుడు 42,436 క్యూసెక్కుల నీటిని వచ్చి చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ సమయానికి ఇప్పటికే 70 శాతం అధికంగా నీటి నిల్వ పెరిగింది.

తుంగభద్రలోకి నీటి చేరిక ఆశాజనకంగా ఉన్నా దాని పరిధిలో ఆంధ్ర సరిహద్దున ఉన్న డిస్ట్రిబ్యూటర్లు, చిన్న కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఆంధ్ర అధికారులు ఇచ్చిన ఇండెంట్ మేరకు 25 టీఎంసీలను హెచ్ఎల్సీకి తాగునీటి అందించాలని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ఈ నీటిని విడుదల చేస్తే వరి నారు పోసేందుకు రైతులకు వీలుంటుంది. అధికారులు కలుగజేసుకొని వరి నారుమడి సాగు చేయడానికి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

రాజకీయాల్లో కొనసాగే అర్హత కోల్పోయిన జగన్ : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

మాజీ ముఖ్యమంత్రి జగన్ రాజకీయాల్లో కొనసాగే అర్హత కోల్పోయారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. శనివారం రాయదుర్గంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నెలన్నర రోజులు కూడా గడవకముందే జగన్ నానా యాగి చేస్తున్నాడన్నారు. ఆయనకు పిచ్చి ముదిరి పాకాన పడిందన్నారు. జగన్ జనం ఇచ్చిన షాక్ నుంచి తేరుకోలేక ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య ఉందని ప్రజల్లో అసత్య ప్రచారం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో వందల మంది టిడిపి నాయకులు, ప్రజలు, మేధావులు, దళితులు, మైనారిటీలు, బీసీలను వైసిపి గూండాలు ఊచకోత కోస్తే శాంతి భద్రతలపై ఏనాడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. రషీద్ హత్యను రాజకీయ ప్రయోజనాలపై వాడుకోవాలని చూస్తున్నాడని విమర్శించారు. ఈ హత్యకు టిడిపి, ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. నెలన్నర క్రితం ఏర్పడిన ప్రభుత్వాన్ని కాదని, రాష్ట్రపతి పాలన రాష్ట్రంలో విధించాలని జగన్ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌కు ఐదేళ్ల అవకాశం ఇస్తే పాలనలో చేతకాదని తెలుసుకున్న ప్రజలు తిరిగి చంద్రబాబుకు అత్యధిక మెజారిటీతో పట్టం కట్టారన్నారు. జగన్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కనీయకుండా చేశారంటే ఆయన పాలన గురించి అర్థం అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను పులివెందుల ప్రజలు కూడా ఓడిస్తారని జోస్యం చెప్పారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

నియోజకవర్గ విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు బంగి శివ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు.ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిచేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జీవన్, గౌతమ్, అరవింద, అనిల్, మాధవ్ పాల్గొన్నారు.

గుత్తిలో బాలుడు అదృశ్యం.. తిరుపతిలో ప్రత్యక్షం..!

ప్రజాశక్తి-గుత్తి



తెలంగాణ దంపతులతో సాయి నిఖిలేశ్వర్‌రెడ్డి

మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన బాలుడు సాయినిఖిలేశ్వర్‌రెడ్డి గుత్తిలో అదృశ్యమై శనివారం తిరుపతిలో ప్రత్యక్షమయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన లావణ్య, కాంతారెడ్డి దంపతుల కుమారుడు సాయినిఖిలేశ్వర్‌రెడ్డి గుత్తి పట్టణ శివారులోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. అయితే ఈనెల 18న ఉదయం గ్రామం నుంచి ఆటోలో పాఠశాలకు వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నిఖిలేశ్వర్‌రెడ్డి పాఠశాలకు తిరుపతికి చేరుకున్నాడు. ఈనెల 19న ఉదయం తిరుపతి స్టేషన్‌లో ఒంటరిగా నిఖిలేశ్వర్‌రెడ్డి కూర్చొని ఉండగా తెలంగాణలోని జనగామకు చెందిన కవిత, అజయ్ దంపతులు గమనించి వివరాలను ఆరాతీశారు. అయితే బాలుడు వారికి జవాబు ఇవ్వకుండా నిరాకరించాడు. దీంతో వారికి అనుమానం వచ్చి బాలుడిని తమ వెంట తిరుమలకు తీసుకెళ్లారు. అనంతరం తిరిగి కొండ నుంచి కిందకు దిగుతూ నిఖిలేశ్వర్‌రెడ్డితో సెల్ఫీ దిగారు. అనంతరం తెలివిగా 'నీ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ చెప్పు.. అందులో ఫొటోను అప్లోడ్ చేద్దాం' అని తెరచి అందులోని నిఖిలేశ్వర్‌రెడ్డి తండ్రి ఫోన్ నంబర్‌ను గుర్తించారు. తర్వాత పోలీసులతోపాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తండ్రి కాంతారెడ్డి తిరుపతికి వెళ్లి కవిత, అజయ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపి నిఖిలేశ్వర్‌రెడ్డిని గ్రామానికి తీసుకొచ్చారు.

రసాభాసగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం

ప్రజాశక్తి-కుందుర్పి

ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉదయం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం రసాబాసగా కొనసాగింది. టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో వివాదం నెలకొంది. 2023 -24 సంవత్సరానికి సంబంధించి జంబుగుంపుల గ్రామంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి నిర్వహించిన సామాజిక ప్రజా వేదికలో టిడిపి, వైసిపి నాయకులు ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు మాటల దాడి చేసుకున్నారు. పోలీసులు కలుగజేసుకుని అందరికీ సర్దిచెప్పడంతో వివాదం సర్దుమణిగింది. శనివారం ఉదయం కుందుర్పి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సమక్షంలో సామాజిక ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావేదికలో గ్రామ పంచాయతీల వారీగా ఉపాధి పనులు, పించన్లపై అధికారులు వివరాలు తెలియజేశారు. ఈ సమయంలో జంబుగుంపుల గ్రామపంచాయతీ టిడిపి నాయకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీ ఏర్పాటు చేస్తున్నట్లు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్వహిస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీపై మాజీ వైస్ ఎంపీపీ రవి, టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య కొద్ది సేపు ఘర్షణ చోటు చేసుకుంది. వాదోపవాదాలు ఎక్కువ కావడంతో సామాజిక తనిఖీ నిర్వహణకు వచ్చిన జిల్లా స్థాయి అధికారులు సమావేశాన్ని ఆపి కార్యాలయంలోకి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటస్వామి సిబ్బందితో కలిసి సమావేశం దగ్గరకు వచ్చారు. సమావేశం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అలాకాకుండా ఘర్షణలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా సామాజిక తనిఖీ అధికారులు కొండను తవ్వి ఎలకను పట్టిన విధంగా తనిఖీ అధికారులు నిర్వహించారని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాధాస్వామి, అసిస్టెంట్ పీడీ సుధాకర్ రెడ్డి, బిజినెస్ ఆఫీసర్ ఫర్ విజిల్, డీఆర్డీఏ పింఛన్ అధికారులు జిలాన్, ఆజాద్ భాషా, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఆర్పీ మీరావలి, ఏపీవో ఓపిరెడ్డి, ఈసీ శర్మ వలి పాల్గొన్నారు.

గంబూజియా చేపలతో దోమల నివారణ


నీటిలో గంబూజియా చేపలను వదులుతున్న అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం
గంబూజియా చేపల ద్వారా దోమలను నిర్మూలించవచ్చని మలేరియా జిల్లా అధికారి డాక్టర్ ఓబులు సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు వర్షం నీరు, మురికినీరు నిల్వ ఉన్నచోట గంబూజియా చేపలను వదిలారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్నచోట లార్వా ఎక్కువ ఉండి దోమలను అభివృద్ధి చేస్తాయన్నారు. అలాంటి చోట గంబూజియా చేపలను వదిలితే లార్వాలను తిని దోమలు వ్యాప్తి కాకుండా చేస్తాయన్నారు. కాగా ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. దోమల ఉత్పత్తిని అరికట్టాలని, ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, డాక్టర్ తేజోరస్మిత, సామాజిక ఆరోగ్య అధికారి మోహన్‌రావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సబ్‌యూనిట్ సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, పిహెచ్‌ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఫాతిమా, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, సత్యనారాయణ శాస్త్రి, జానీబాషా, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, ఆనంద్, మరియు ఆఫీస్ సబార్డినేట్ శివరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి : ఎడిజె

గుత్తి : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటించాలని జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి సూచించారు. శనివారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి అధ్యక్షతన హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు బీమా సౌకర్యం కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె.మనోహర్‌బాబు, ఆర్.రామ్‌గోపాల్, పుట్టరాజు, శ్రీనివాసులు, వీసీ.గంగాధర్‌కుమార్, సోమశేఖర్, శివకుమార్ ఆచారి, కె.శ్రీనివాసులు, ట్రైనీ ఎస్.సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే ఉజ్వల భవిష్యత్తు

వజ్రకరూరు : విద్యార్థులు కెరియర్ గైడెన్స్‌పై మెలకువలు పాటిస్తే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, కౌన్సిలింగ్ ప్రతినిధులు భయపరెడ్డి, రామాంజనేయులు సూచించారు. జై కిసాన్ ఫౌండేషన్ నిర్వాహకుడు నాగమల్లి ఓబులేష్, భవిష్యత్ కౌన్సిలింగ్ వారి సహకారంతో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండలోని కెజిబివిలో కళాశాలలో కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా టెన్త్, ఇంటర్, ఆతర్వాత ఏ చదువులు చదవాలి, ఏ గమ్యం ఎంచుకోవాలి, అందుబాటులో ఉన్న యూనివర్సిటీలు, కళాశాలలు, ఉద్యోగావకాశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, భవిష్యత్ కౌన్సిలింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి కేసేపల్లి విద్యార్థి


ట్రిపుల్ ఐటీకి ఎంపికైన భానుప్రకాష్

నార్పల : మండల పరిధిలోని కేసేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి స్కూల్ ఫస్ట్‌గా నిలిచిన భానుప్రకాష్(2023) ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యాడు. భానుప్రకాష్ 2023 ఎస్ఎస్‌సి ఫలితాల్లో 569/600 మార్కులు సాధించాడు. ఈనేపథ్యంలో ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు రాజు, శాంత, ప్రకాష్‌రెడ్డి, తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No.118/2018
Between:
J.వేంకట శేషారెడ్డి S/o. J.రామిరెడ్డి 4వ రోడ్డు, సంజీవ నగర్, తాడిపత్రి, అనంతపురము జిల్లా. ... వాది
మరియు
1) A. రాజాబాబు డైడ్ బై ఎల్ ఆర్స్ 2 మరియు 3
2) ఆకునూరి శారద
3) ఆకునూరి బాలసాయి చందన ... ప్రతివాదులు
రెండవ ప్రతివాదికి సమన్సు
ఆకునూరి శారద, W/o లేట్ A.రాజాబాబు, D.No.16-7-218, రామమూర్తి నగర్, ఇంద్ర ఛేంబర్స్ దగ్గర, నెల్లూరు.
వాది తన ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం మీ మీద మరియు ఇతర ప్రతివాదుల మీద పై దావా దాఖలు చేసి ఉంటున్నాడు. సదరు దావా మీ హాజరు నిమిత్తం 22-7-2024వ తేదీలకు వాయిదా వేసి ఉంటూ ఉన్నారు. కావున మీరు పై తెలిపిన తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షముందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 22-07-2024
ఇట్లు:
ఒగేటి సుబ్బరంగయ్య
వాదిపరం అడ్వకేట్, తాడిపత్రి.

In The Court of The Prl. District Judge, Ananthapuramu.
(In Tha matter of Obtaining Permission to Sell Tha Property of Minors Share Vadde Akhila and Vadde Uday Kiran)
G.W.O.P. No:37/2024
Between:
Vadde Umadevi W/o Late Vadde Anjineyulu, D.No:23-430, Chatteppabavi Street, Guntakal Town, and Mandal, Ananthapuramu Dist.
...Petitioner
And
To Whomso Ever it may Concern
...Respondants
ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై కేసులో మైనర్లు అయిన వడ్డె అఖిల మరియు వడ్డె ఉదయ్ కిరణ్‌లకు సంబంధించిన భాగం ఆస్తిని అమ్ముటకు పై కోర్టు అర్జీదారురాలు అర్జీదాఖలు చేసి యున్నారు. సదరి కేసు 24/07/2024వ తేది ఉదయం 10:30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలున్నచో స్వతహాగా కానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను.లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరంగా తీర్మానింతురని తెల్పడమైనది.
SCHEDULE
Property situated in R.D. of Anantapuramu and S.R.D. of Guntakal within the limits of Donimukkala Village Polam and Panchayat, Guntakal Mandal with the following description.
Babu: Govt. Dry,**Sy.No.6**, A.C. 4.80 paiki, **A.C.**4.15 paiki, **A.C.** 3.96
Bounded by:East: Land of Bandaru Rarnu; **South:** Government Property; **West:** Land of others; **North:** Land of Venkataramudu.
(By Order of Court)
P.GOPAL RAO, M.SUDHAKAR,
Advocates, Anantapuramu. Cell:9849429739

స్వచ్ఛ 'దుర్గం' సాధనకు కృషి చేయాలి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం
స్వచ్ఛ రాయదుర్గం, స్వస్థ రాయదుర్గం సాధనకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం రాయదుర్గంలోని డ్వామా సమావేశ మందిరంలో పురపాలక, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో డెంగీ బెడద నివారణకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ మాట్లాడుతూ పట్టణంలోని 13 ప్రాంతాల్లో మురికినీరు నిల్వ ఉంటోందన్నారు. ఐదు కుంటలు, చెరువులలో నీరు నిల్వ ఉంటున్నట్లు గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, మలేరియా అధికారి నాగేంద్రప్రసాద్, ఆరోగ్య విద్యా బోధకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సందేశ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ జగదీష్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ కోదండ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను మహావృక్షాలను చేద్దాం

'హరిత అనంత ప్లాంటేషన్'లో వక్తలు


శింగనమల మండలంలో మొక్క నాటుతున్న అధికారులు

ప్రజాశక్తి-నార్పల
ప్రతి ఒకరం మొక్కలను నాటి మహావృక్షాలను చేద్దామని ఎంపిడిఒ రాముడు పిలుపునిచ్చారు. హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగాశనివారం మండల పరిధిలోని రంగాపురం నుంచి నార్పల క్రాస్ వరకూ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నాటిన మొక్కలను మహావృక్షాలుగా మార్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగాపురం సర్పంచి కుళ్లాయప్ప, ఉపాధి హామీ టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని జూలాకాలువ ఎంపియుపి పాఠశాల ఆవరణలో ఎంఇఒ నరసింహరాజు ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచుదామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, ఇఒఆర్‌డి మురళీకృష్ణ, ఎంపిఒ శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ బీవీ రమణ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి విజయ, ఎపిఒ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ అక్బర్‌వలి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహళ్, గోనేహాల్, కృష్ణాపురం, లింగదహాల్ గ్రామాల్లో టిడిపి నాయకులు, అధికారులు మొక్కలు నాటారు. ఇందులో భాగంగా రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ ప్రెసిడెంట్ కొత్తపల్లి మల్లికార్జున, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసిపి నేతలపై దాడులు

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు
రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, హింస రాజ్యమేలుతోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శనివారం ఉరవకొండలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి కార్యకర్తల ఇళ్లు, ఆస్తులు, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. వినుకొండలో పట్టపగలే దారుణహత్య జరగడం రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. అలాగే ఎంపీ మిథున్‌రెడ్డిని తన నియోజకవర్గానికి వెళ్లకుండా హౌస్ అరెస్ట్ చేయడం, ఆయనపై రాళ్లతో దాడి, మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటిపై దాడి చేసి ఆస్తులు ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. ఈ దాడులన్నీ సిఎం చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్ ఆదేశాల మేరకే జరుగుతున్నాయని ఆరోపించారు. టిడిపి దాడులను దేశవ్యాప్తంగా తెలియజేసేందుకు ఈనెల 24న మాజీ సిఎం జగన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఉరవకొండ ఎంపిపి నరసింహులు, విడపనకల్ జడ్పిటిసి హనుమంతు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, నాయకులు కరణం భీమిరెడ్డి, భీమ్‌రావు, కేసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జెడ్పీ ఛైర్‌పర్సన్


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిజమ్మ

అనంతపురం అర్బన్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కేవీ మురళీకృష్ణను జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శనివారం ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఆలం'కు పలువురి శుభాకాంక్షలు

నార్పల : టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన అభిమానులు కేక్‌లు కోసం పంచిపెట్టారు. పలు ఆలయాల్లో పూజలు చేశారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో అన్నదానాలు చేశారు. పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆలం నరసానాయుడు ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్యం సమస్య రానీయొద్దు

పెద్దవడుగూరు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం డయేరియా, మలేరియా, అతిసారం తదితర జబ్బులు వ్యాపిస్తున్నందున గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసీ భాస్కరరెడ్డి, ఎంపిడిఒ గోపీకృష్ణ, తహశీల్దార్ శేషారామ్‌సింగ్, ఎపిఒ పుల్లారెడ్డి, వైద్యుడు శ్రీనివాసబాబు, పశు వైద్యాధికారిణి కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

నూనెగింజల సాగుపై సమీక్ష


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం
నూనె గింజల పంటల సాగుపై శనివారం మండలంలోని ఓబులాపురం గ్రామంలో భారత ప్రభుత్వ వ్యవసాయశాఖ, నూనెగింజల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నూనెగింజల అభివృద్ధి విభాగం అధికారులు అవినాష్, శ్రీకాంత్ కలిసి నూనె గింజల సాగుపై రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వేరుశనగ పంట సమయం, ఎంత ఖర్చు, విత్తనశుద్ధి, కలుపు, ఎరువులు తెగుళ్లు, సూక్ష్మపోషకాలు, పంట కోతలకు ఎంత అయ్యే ఖర్చు అవుతుందో రైతులతో రాత పూర్వకంగా తీసుకున్నారు. అదేవిధంగా సబ్సిడీ విత్తనం, వ్యవసాయ పనిముట్లు అందుతున్నాయా.. అని ఆరాతీశారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ఈనెల ఆఖరి వరకూ వేరుశనగ విత్తనం వేసుకోవచ్చన్నారు. రాబోయే నాలుగైదు రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు వేరుశనగ సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్, అనంతపురం డివిజన్ రవి, కేంద్ర వేరుశనగ పరిశోధన కేంద్రం అధిపతి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

మార్పులు - చేర్పులు




ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అదికారుల మార్పులు చేర్పులను చేపట్టింది. ఈవారం రోజుల్లో కొత్త అధికారులు వచ్చేశారు. సత్యసాయి జిల్లాకు కలెక్టర్‌తోపాటు, ఎస్పీ కొత్తగా వచ్చారు. అనంతపురం జిల్లాకు ఎస్పీ కొత్తగా వచ్చారు. వీరితోపాటు జిల్లా స్థాయి అధికారుల మార్పులు ఒక్కొక్కటిగా జరుగుతూ వస్తున్నాయి. ఇక విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు అంతకు మునుపున్న వారు రాజీనామాలు చేశారు. వారి రాజీనామాలు ఆమోదించడంతోపాటు వారి స్థానంలో ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఈ వారంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా పాలనలో ఒక్కొక్క మార్పులు చేపడుతూ వస్తోంది. తహశీల్దార్లను ఎన్నికల సమయంలో బయట జిల్లాలకు పంపించిన వారిని తిరిగి సొంత జిల్లాలకు వెళ్లే విధంగ ఉత్తర్వులు ఈ వారంలో వెలువడ్డాయి. వారు కూడా వస్తే మండల స్థాయిల్లోనూ అధికారుల్లో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఆయా తహశీల్దార్లు తాము కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారు. ముఖ్య నాయకులందరినీ కలసి తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. సిఫారసుల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

ఈ వారంలోనూ ప్రకృతి కరుణించలేదు. వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రమంతటా విస్తారంగా వానలు పడుతున్నా అనంతపురం జిల్లాలో మాత్రం చినుకు నేల రాలడం లేదు. మేఘాలు కమ్ముకుని రావడం బలమైన గాలలకు చినుకు నేలరాలకుండా మేఘాలు తరలి వెళ్లడం కనిపిస్తోంది. గతేడాది వర్షాల్లేక సరిగా పంటలు సాగు చేసుకోలేకపోయిన రైతులు ఈసారి జూన్‌లో పడిన వర్షం చూసి ఆ ఏడాది మంచి వర్షపాతం నమోదవుతే పంటలు బాగా పండుతాయని ఆశించారు. అందుకు అనుగుణంగా దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్నారు. అయితే అదును దాటుతున్నా జులై నెలలో సరైన వర్షాలు పడలేదు. ఇక మరో వారం జరిగితే ఇక విత్తనం వేసినా రైతుకు పెద్దగా ప్రయోజనముండదు. వర్షాధారం కింద వేరుశనగ సాగుకు అంత అనువైన సమయం కాదని భావిస్తారు. అందుకే చివరి ఆ వారం రోజులైనే పెట్టుకున్నారు. ఈ వారం కూడా రాకపోతే ఖరీఫ్‌పై ప్రకృతి దెబ్బతిసినట్టుగానే ఉంటుంది. ఇప్పటికే 31 మండలాల్లోనూ ఈ నెల వర్షాభావం నెలకొంది. ఇక ప్రభుత్వం వైపే రైతులు ఎదురు చూసే పరిస్థితులు నెలకొననున్నాయి. ఇక ఈ వారంలో రాజకీయ వాతావరణంలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి అధికారపార్టీలో కొన్ని చోట్ల అప్పుడే తగాదలు నడుస్తుండగా మరికొన్ని చోట్ల ఇతర పార్టీల నేతలతో వైరం నడుస్తోంది. ప్రధానంగా తాడిపత్రిలో అప్పుడే ఇరుపార్టీల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని బహిష్కరించాలని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఆ ప్రకటన చేసిన మరుసటి రోజే పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లిరావడం చర్చనీయాంశమూ అవుతోంది. రాజకీయవంగానూ ఇక్కడ వేడిని రాజేస్తోంది. ఎన్నికలు అయిపోయినా కూడా తాడిపత్రి రాజకీయ వేడి మాత్రం తగ్గడం లేదు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సిఐ.కిషోర్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున ఎక్సైజ్ సిఐ కిషోర్‌కుమార్

ప్రజాశక్తి-వజ్రకరూరు
మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఉరవకొండ ఎక్సైజ్ సిఐ కిషోర్‌కుమార్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎం.సునీత అధ్యక్షతన మాదక ద్రవ్యాలు,మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గురుకుల పాఠశాలల్లో చదువుకునేటప్పుడు విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి ఉన్నత శిక్షణాలకు చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.జయమ్మ, ఉపాధ్యాయులు సుధారాణి, సుజాత, స్టాఫ్‌నర్స్ ఉదయ్‌కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అక్బర్ ఐ ఆసుపత్రిని సందర్శించిన 'ఎన్‌ఎబిహెచ్'

అనంతపురం : నగరంలోని సాయినగర్‌లో ఉన్న అక్బర్ ఆసుపత్రిని ఎన్‌ఎబిహెచ్ బృందం శుక్రవారం సందర్శించింది. నేషనల్ అక్రిడేషన్ బోర్డు నుంచి డాక్టర్ ప్రతిమ, తమిళనాడు నుంచి డాక్టర్ సెంథిల్‌కుమార్ ఆసుపత్రిని సందర్శించి నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ నిబంధనల ప్రకారం అక్బర్ ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలపై సంతోషం వ్యక్తం చేశారు. ఎన్‌ఎబిహెచ్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నందున డాక్టర్ అక్బర్, డాక్టర్ అల్తాఫ్, డాక్టర్ నాజియా, ఆసుపత్రి సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎబిహెచ్ అక్బర్ ఐ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన తెలుగు యువత నాయకులు

శింగనమల : జిల్లా కేంద్రంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌ను తెలుగు యువత జిల్లా మాజీ కార్యదర్శి కాయల రాజశేఖర్‌యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జెస్సు, నరేష్, అమర్నాథ్ పాల్గొన్నారు.

22న పెన్నహోబిలంలో వేలంపాట

వజ్రకరూరు : ఉరవకొండ మండలం పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం ఉదయం తలనీలాల సేకరణ, టెంకాయల విక్రయ హక్కుల కోసం వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ కె.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి సమక్షంలో వేలంపాటలు ఉంటాయన్నారు. పాల్గొనాలనుకునే వారు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

జనసేన సభ్యత్వ నమోదు

పుట్లూరు : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలో చేపట్టారు. ఇందులో భాగంగా పలువురి నుంచి సభ్యత్వ నమోదు చేసుకుని బీమా సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుళ్లాయప్ప, రవి, సుధాకర్, వెంకట శేఖర్, నరేష్‌కుమార్, రాజశేఖర్, నాగరాజు, సురేష్, రాజకుళ్లాయప్ప, హరి, సతీష్ పాల్గొన్నారు.

మంత్రి పయ్యావులను కలిసిన సర్పంచులు

వజ్రకరూరు : ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను విడపనకల్లు మండలం సర్పంచులు తిప్పారెడ్డి, తిమ్మరాజు, చంద్రశేఖర్, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి వన్నూరుస్వామి శనివారం అమరావతిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్పర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణకు ఇంటర్, డిప్లొమో, డిగ్రీ ఆపై విద్యార్హత ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 25వ తేదీలోగా కళాశాలలో తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 91829 20381 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గడ్డి విత్తనాల పంపిణీ

కళ్యాణదుర్గం : రైతుల సౌకర్యార్థం రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసగుప్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 75శాతం సబ్సిడీతో ఐదు కిలోల విత్తనాలకు రూ.115 చెల్లించి తీసుకోవచ్చన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డులతో సంబంధిత పశువుల ఆసుపత్రిలో అందజేసి తీసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ కవర్లు రోడ్లపై వేస్తే జరిమానా

కళ్యాణదుర్గం : ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు రోడ్లపై పడవేస్తే దుకాణాల యజమానులకు జరిమానా విధిస్తామని కమిషనర్ నరసారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను రోడ్లపై పడి వేయడంతో డ్రెయినేజీల్లో చెత్తా చెదారం చేరుకుని నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. కావున ఎవరూ కవర్లను రోడ్డుపై పడవేయద్దని సూచించారు.

కామ్రేడ్ లక్ష్మన్న అంత్యక్రియలు

కుందుర్పి : ఉపాధ్యాయ, కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు కామ్రేడ్ లక్ష్మన్న (93) అంత్యక్రియలు శనివారం మండల కేంద్రంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. లక్ష్మన్న అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా నాయకులు శనివారం భారీగా తరలివచ్చి నివాళులర్పించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న గ్యాస్ గోడౌన్ వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సంజీవప్ప, అమీనమ్మ, ఎస్టీయూ నాయకులు దస్తగిరి, కర్ణాటక సీపీఐ నాయకులు శివరుద్ర, రామకృష్ణ, కరెన్న, నాయకులు గోపాల్, సూర్యనారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఫాదర్‌విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నమెంట్

తాడిపత్రి : పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేకరి వెంకటరామిరెడ్డి, పిఇటిలు నరసింహా, మధు, చంద్ర, వంశీ, ప్రత్యూష, రామాంజినమ్మ, ఎటిఎల్ లలిత, సీనియర్ కోచ్ సాదిక్‌వలి, భార్గవ్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమంతరాయుడు, దుర్గమ్మ ఉత్సవం

బెలుగుప్ప : మండల పరిధిలోని దుద్దేకుంటలో వెలసిన హనుమంతురాయుడు, దుర్గమ్మ జల్ది పరుష శనివారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంలో మూడోవారం స్వామిని ప్రతిష్ట చేసి ఉత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్వామివారిని ఊరేగింపుగా ప్రతిష్ట చేసి జల్ది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుడిపూడి తిమ్మప్ప, గుడిపూడి రాము, లింగాయతుల రాజారెడ్డి, బాలప్ప గారి వెంకట్రాములు, ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మాచర్లలో తాడిపత్రి ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


పవన్‌కళ్యాణ్ (పాతచిత్రం)

అనంతపురం : తాడిపత్రి పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో శనివారం ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అనంతపురం జిల్లా, తాడిపత్రికి చెందిన దొడ్డి పవన్‌కళ్యాణ్(22) మాచర్లలోని ఓ ఇంజినీరింగ్ కళశాలలో 4వ సంవత్సరం చదువుతున్నాడు. తన తోటి విద్యార్థులతో కలిసి కళ్యాణ్ మెయిన్ రోడ్డులోని నాయుడు డాబాకు ఎదురుగా ఓగదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇతనితో పాటు ఉంటున్న మరో ఇద్దరు విద్యార్థులు ఇటీవల వారి స్వగ్రామాలకు వెళ్లారు. గత రెండు రోజులుగా పవన్‌కళ్యాణ్ ఒక్కడే గదిలో ఉంటున్నాడు. కాగా కళ్యాణ్ తమ్ముడు రాజేంద్ర కూడా మాచర్లలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. అతను తన మిత్రులతో కలిసి మరో గదిలో ఉంటున్నాడు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో తన అన్నయ్య ఫోన్ పని చేయకపోవడంతో అనుమానం వచ్చి అతను ఉంటున్న గదికి వెళ్లి చూశాడు. గదిలో కళ్యాణ్ ఉరికి వేలాడుతూ కన్పించాడు. ఈ విషయాన్ని తన తండ్రికి తెలియజేశాడు. కళ్యాణ్ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడని, ఆ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోవా మద్యం పట్టివేత

శింగనమల : గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిసిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు మండలంలోని ఉల్లికల్లు గ్రామం వద్ద కారులో గోవా మద్యాన్ని తరలిస్తున్న అమ్మలదిన్నెకు చెందిన నల్లని శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 960 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.